5655
కథా నిలయం
3735
శ్రీకాకుళం

తేరు ఒరిగింది ....

"వద్దు. వద్దు అది భగవంతుని సొమ్ము అది దేవుడికే చెందాల. ఆలయానికి సంబంధించిన వసతులకు ఉపయోగింపబడాలి, మనం దాన్ని హరాయించుకోలేం, దాన్ని మన స్వంతం చేసుకుని, కోరి పాపపంకిలం పట్టించుకోవద్దు నామాట వినండి, మనకు భగవంతు డిచ్చినదాంతో తృప్తి పడదాం!" వెనుకనుంచి గోలగా అరుస్తున్న అన్నపూర్ణ కంఠ స్వరం అంతకంతకూ పెద్దదై, వరండా మెట్లు దిగుతున్న ఆచారి కాళ్ళకు సంకెళ్లు వేసింది

"ఏమిటా వెధవ్వాగుడూ? ఆడ్డే పేలక! ఆడపీనుగవి నీకేం తెలుస్తుంది మగాడి సంపాదన? అసలు నీకు సుఖపడే యోగం వుంటేకదూ? నీఖర్మ! నాబంగారు తల్లికి....లలితకు....చేయిస్తాను నగలన్నీ!" అన్నాడు చిరాకుగా, కోపంగా పంతంగా.

"లలితకా? మనచిట్టితల్లికా? ఒద్దు ఒద్దు....ఎందరో నిలువుదోపు లిచ్చిన సొమ్ము.... ఎన్నో ఆపదల తాలూకు మొక్కులవా సొమ్ము.... ఆ పీడలన్నీ మన ఒక్కగానొక్క బిడ్డకు చుట్టబెడతాం? ఇక నాకు పిల్లలుపుట్టే అవకాశం కూడా లేదని మీకు తెలుసు. భగవంతుడు చల్లగా చూస్తే

అంతేచాలు .... నా బిడ్డకవేమివద్దు!" ఆవేశంగా అరుస్తున్న అన్నపూర్ణ, ఆయాసంతో. మంచంమీద వెనక్కువాలింది మరి మాట్లాడలేక,

అన్నపూర్ణ పీక నులిమేయాలన్నంత కోపం వచ్చింది ఆచారికి. గబగబ వెనక్కివచ్చి ఆమెవేపు మిర్రిచూస్తూ, అరిచాడు "నువ్వు నోరుమూసుకుంటావా లేదా ?"

అన్నపూర్ణ నీరసంగా కళ్ళు మూసుకుంది. అస్పష్టంగా ఆమె పెదవులు గొణిగాయి. "నా నోరు మూయగలరు కానీ దేవుడికళ్ళుమూయలేరు!"

"సర్లె.... వెధవపీడ!" చీదరించుక, గబగబ వీధిలోకి వచ్చాడు ఆచారి. కంసాలి బ్రహ్మయ్య ఇంటివేపు అడుగులు పడ్తున్నాయేగానీ, అలోచనంతా అన్నపూర్ణ మాటలమీదే వుంది.

ఏం మనిషి ? ప్రతిదీ భయమే....అలా అడుగడుగునా తనూ భయపడ్తూ కూర్చునివుంటే, ఈ నాడింత ఉచ్ఛస్థితిలోకీ తను రాగలిగివుండేవాడా ?

అడుగులు ముందుకూ, ఆలోచనలు వెనక్కు....గతంలోకి పరుగులు తీసాయి.... !

♦ ♦ ♦ ♦

మొదట్లో పాడుబడ్డ గోడలతో, విరిగిన మంటపాలతో, ఎండిన చెట్లుమ్రానులతో, నానాగాభరాగావుండేది ఆలయం ! ఆచారి పేరుకు పూజారేగానీ, అర్చన అవసరం ఏనాడూ ఏర్ప

దింది కాదు....గర్భగుడి వెనకాల మండపంలో తనూ, సుబ్రహ్మణ్యం, రాములు, అయ్యంగారు ఇంకా మరికొందరు కుర్రకార్డ్సు పేకాట ఆడుతూండేవారు అస్తమానూ!

కొత్తగా కాపురానికి వచ్చిన అన్నపూర్ణకు మాత్రం ఆచారి వరసేం నచ్చలేదు.

"ఎందుకిలా అస్తమానూ పేకాటలో మునిగిపోయి ఆలయాన్ని మరింత పాడుపెడ్తున్నారు? కాస్త నలుగురినీ కూడవేసి ఆలయం బాగుచేయించండి. నిత్య పూజావిధులు నియమంగా నిర్వహించండి. ఇహమూ, పరమూ కలిసి వస్తుంది!" అని శత పోరటం మొదలెట్టింది నిత్యపూజా విధులన్న మాట అంతగా నచ్చకున్నా, అన్నపూర్ణ మాటలతో ఓ మెరుపులాటి ఆలోచన వచ్చింది ఆచారికి! ఆచారి అదృష్టం బావుండి, రోజు రోజుకూ గ్రామం పెరిగింది, పంచాయతీ వచ్చింది! గ్రామస్థాయిలో జరుగవలసిన న్యాయవిచారణ మాటఎలావున్నా పార్టీలూ, పంతాలూ, పొరపాలూ, తగింపలూ, పెరిగిపోయాయి అది ఆచారికి అతగాడి ఆలోచనకూ చక్కటి రాజమార్గమైంది

నాయుడుగార్ని రెచ్చగొట్టి మంటపాలు బాగుచేయించాడు. అందులో బాగా కలిసొచ్చింది! రెడ్డిగారిని దువ్వి ఆలయంలో ఓ మూలగా శివలింగం ప్రతిష్ఠింప చేయించాడు. దాంతో బాగా నిలదొక్కుకున్నాడు! వైశ్యులను ఊదరపెట్టి అదే ఆలయప్రాంగణంలో ఓ చిన్న రామాలయమూ, ఆంజనేయస్వామి గుడి. విష్ణ్వాలయమూ, ఇంకోవేపుగా నవగ్రహ

కూటమి, పార్వతీమందిరం... సుబ్రహ్మణ్యస్వామి-ఒకటేమిటి అప్పటి ఆలయ ప్రాంగణం....స్మశానవాటికలా వుంటే, ఐదేళ్ళల్లో అది, అడుగుకో గుడి గుడికో దేవుడిగా. పెరిగిపోయింది సుబ్రహ్మణ్యం, రాములు, అయ్యంగారు, శఠగోపం, తన క్రిందనే -తనకు అనుకూలంగా వుండే వాళ్ళందర్నీ పూజారులుగా, నౌకర్లుగా, గుడికి సంబంధించిన పనివారలుగా మార్చేశాడు ఆచారి ! గవర్నమెంటు అనాధీనం కొంత దేవాలయ మాన్యంగా మార్పించాడు మంచి ఆసాములను పట్టుకుని గవర్నమెంటు గుర్తింపూ, గ్రాంటూ కూడా వచ్చాయి. ఆలయానికి ! ఓ హుండీ-క్యూసిస్టమ్ కూడా ఏర్పాటయింది! పదేళ్ళు తిరిగేసరికి ఆలయంతో బాటు ఆచారిగూడా బాగా పెరిగాడు గ్రామం టౌన్‌గా మారినట్లు. రెండు మేడలూ, పదెకరాల మాగాణి పదిలపరచాడు.

పనిలో పని, గర్భగుడి వెనుకగా ఓ పెద్ద మంటపాన్ని మాంఛి గది ఆకారంలో చేయించాడు ఆచారి ఆ గదిలో రాత్రి పది దాటాక ఓ చిత్రమైన కోలాహలం బయల్దేరుతుంది.

పగలంతా "ఊర్ధ్వాయనమః ఓం
ఊర్ధ్వలింగాయనమః ఓం"
అన్న కంఠాలన్నీ రాత్రి పదిదాటాక
"అసూనమః ఓం!
కాసూనమః ఓం !" అంటూంటాయి !

అది మాంఛి లాభసాటి వ్యాపారమయ్యింది ఆచారికి ! ఈ మధ్య పెట్టిన కాలేజితాలూకు లెక్చరర్లు కొందరూ హైస్కూలు మాస్టార్లు కొందరు, ఊరిలోని మోతుబరులు, కుర్రకారు, అంతా రాత్రయ్యేసరికి అక్కడ పోగవుతారు! ఈ చతుర్ముఖ పురాణపారణ దురంధరు లందరికీ, లైట్లు, సిగరెట్లు, లైటర్లు వెలిగించి ఇవ్వటానికి, చాపలూ, జంపకానాలు పరవటానికీ, చిన్న చిన్న కుర్రాళ్ళని తను నెల జీతాలు ఏర్పాటుచేసి మరీ నియమించాడు ఆచారి ! ఒక కొత్త పేక సప్లయి చేయిస్తాడు ఆచారి - ఆకుర్రాళ్ళచేత ఓ జట్టుకు. జట్టులోని వారందరూ తలకోరూపాయి ఇవ్వాలి పేక సప్లయి చేసిన కుర్రాడికి .... అలాగే పదిజట్లవారికీ ! పది ఆటలు ఆడాక పేక నలిగిపోగానే, అది ఆచారి తీసుకుంటాడు. సగం ధరకు చిన్నసైజు పేకాటరాయుళ్ళకి (రిక్షాకుర్రాళ్ళూ - వగైరాలకు) అమ్మి వేస్తాడు. కొత్త పేకల తాలూకు పైసంపాదన రోజుకు సగటున నాలుగు రూపాయల పైగానే వుంటుంది ఆ పని కుర్రాళ్ళ జీతాలుపోను పైదంతా తనకే !

మరో కొత్తరకం 'హుండీ' తయారుచేశాడు ఆచారి ఆగదిలోనే ! 'రమ్మీ' లో గెలిచిన ఆసామీ ఆ హుండీలో (దేవుడికిగానూ !) ఐదు రూపాయలు వేయాలి. 'బిడ్జి' అయితే మూడు! ఒక్కొరోజు తెల్లవారుఝాము అయ్యేసరికి హుండీలో, ఏభై, అరవై కూడా పడటం కద్దు! సుబ్రహ్మణ్యం శఠగోపం, అయ్యంగారు వగైరాలు పడగ ఎత్తకుండా, నోరు మెదపకుండా వాళ్ళనోళ్ళు నేర్పుగా మూయించాడు ఆచారి.

ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ని మంచి చేసుకున్నాడు. ఎలా అయి తేనేం, ఆ ఆలయానికి ఆచారి మకుటంలేని మహారాజు అయి పోయ్యాడు!

రోజురోజుకూ భర్తలోని మార్పూ, భర్త సంపాదన లోని రహస్యాలూ తెలుసు కుంటున్న అన్నపూర్ణ గుండె బేజారుత్తిపోవటం మొదలెట్టింది!

"ఆలయం బాగుచేయించారు-అది నాకు సంతోషం! కానీ ఆలయంలోనే-పవిత్రమైన భగవంతుని సాన్నిధ్యంలోనే మీరు చేస్తున్న ఘోరాలేమిటి ?" అంటూ నిలవెయ్యటం మొదలెట్టింది! మొదట్లో ఆమె ప్రశ్నలకు సమాధానంగా చిరునవ్వు నవ్వేవాడు. తర్వాత విసుక్కునేవాడు, రానురాను తాడి ప్రమాణాన లేవటం అలవర్చుకున్నాడు. లలితను ప్రస వించగానే అన్నపూర్ణకు బ్లడ్‌ప్రెషర్, ఆయాసం, గుండెపోటు పట్టుకున్నాయి ఇక కాన్పులు రాకుండా చేసేసారు డాక్టర్లు.

"అసలిలాటి విషయాల్లో ఆడవాళ్ళు తలదూర్చ కూడదు దూర్చారో - వాళ్ళకు అనవసర ఆందోళన ఎక్కు వౌతుంది! ఆరోగ్యం చెడుతుంది! అన్నదే ఆచారి సిద్ధాంతం!

ఎందరో భక్తులు శేర్లకొద్దీ నెయ్యితెచ్చి దీపారాధన సెమ్మెలలో దిమ్మరిస్తారు. అది దీపారాధన కొండ కెక్కేంత వరకూ వుంచుతాడా చయనులు? వూహూం! ఒకజట్టు భక్తులలా కదిలి వెళ్ళగానే మూలనున్న తన సత్తు కారియర్ లోకి ఆ నెయ్యంతా వంచేసుకుంటాడు. నూనే అంతే!

కొట్టిన కొబ్బరికాయ గిన్నెలన్నీ దేవస్థానంవారికి అప్ప చెప్పాలన్న నియమం ఆచారికి అసలేలేదు! తనకూ అక్కడి నౌకర్లకూ-పోను మిగతావే మిగుల్చుతాడు! హారతి పళ్ళెం పట్టి - "హుండీలో వేయకండి.... ఈ పళ్ళెంలో వేయండి కానుకలు!" అని గుసగుసగా మంత్రాలనే చెప్పి, వారు వేయదల్చుకున్న పైసలు పళ్ళెంలోనే వేయించుక రొండిని దోపుకుంటాడు. ఇక సాంబశివం, సీతన్న, సుబ్బలు, యాదయ్యలాటి నౌకర్లు మాత్రం తక్కువా! "ఇటువేపు రాండిబాబూ! త్రోవచూపుతాం! పిల్లలు జాగ్రత .... కొబ్బరినీళ్ళు పడ్డా యిక్కడ! పాకుడుగా వుంది .... అడుగు జాగ్రత్తగా వేయండి!" అంటూ మహా వినయంగా, పరోప కారమే తమ జీవన ధ్యేయ మన్నంత తియ్యగా మాట్లాడు తూనే మరోవేపు "మీ శక్త్యానుసారం .... ఇహిహీ ....!" అంటూ చేయి జాపుతుంటారు! మరి వాళ్ళందరి భార్యలూ అన్నపూర్ణలా, లేనిపోని ఆలోచనలతో మంచం మరణం అవు తున్నారా? ఆచారికి అందుకే అన్నపూర్ణంటే తగని చిరాకు .... అన్నపూర్ణంటే ఎంత కోపమో ఒక్కగానొక్క పిల్ల లలితంటే అంతప్రాణం .... ఆరేళ్ళ లలిత "బాలాం బిక" లా వుంటుంది!

మొన్నను - ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ - పాపం ఈయన జాలి గుండె కలవాడు ఎదుటివారి కష్టసుఖాలు ఆలోచించ గల మంచి హృదయమున్నవాడు, స్వపర భేదం లేనివాడూ కాబట్టి - తనూ, ఆయనా గుంభనగా సాగిస్తున్నారు వ్యవ హారం! ఎవరో గొప్పవారు నిలువుదోపు ఇచ్చిన నూటఇరవై

నవర్నుల సొమ్ములో - ఏభై నవర్నులు చేరిసగంగా పంచి - మిగతాది దేవస్థానం ట్రస్ట్‌కు జమకట్టాడు మహానుభావుడు ఎవరైతేనేం? దేవుడులాంటివాడు! అలాగే మరోసారి....! మరోసారి .... అయితే నేం? ఇంట్లో అన్నపూర్ణ ఆ సొమ్ము వేలేసి ముట్టుదుకదా? ఆ మటుకూ భగవంతుడి సొమ్ము అపళంగా ధరించటం అపరాధమని,తనకు నమ్మకస్తుడైన కంసాలి బ్రహ్మయ్యచేత అవి చెరిపించి క్రొత్తరూపాలలో తయారు చేయిస్తాడు లేదా, భూమిగానో, ఇళ్ళగానో రూపాంతరం చెందిస్తాడు! అయినా అన్నపూర్ణ దదోమూర్ఖపు పట్టుదల ... తను తాకదు. లలితను ముట్టుకోనివ్వదు.

◆ ◆ ◆ ◆

"ఏమిటయ్యా బావా! అంత దీర్ఘాలోచనతో నడుస్తున్నావ్? కంసాలి బ్రహ్మయ్య యిల్లు దాటిపోయావు కూడా?" ప్రశ్న విని త్రుళ్ళిపడి గతస్మృతులలోనుంచి బయటికి వచ్చాడు ఆచారి ఎదురుగా సోమయాజులు నిల్చొని నవ్వుతున్నాడు. ఆ సమయములో సోమయాజులుపై లోలోపల మండిపడ్డాడు ఆచారి "వెధవ! అవులిస్తే పేగులెక్క పెడతాడు!" అనుకున్నాడు కసిగా. తడబాటు అణుచుకుంటూ "ఆహాఁ ఏంలేదు యాజులూ! పది రోజుల్లో రథోత్సవం జరిపిస్తానంటున్నాడు రామిశెట్టి. ఆ విషయమై ఏర్పాట్లుగురించి ఇలా ఆఫీసర్ గారింటివేపు వెడుతున్నా....!"

"రామిశెట్టికూడా నీలానే అసాధ్యుడయ్యా బావా! దేవుణ్ణికూడా వలలో వేసుకున్నాడు. కోస్తాలో వున్న కొడుకు

బ్లాక్ మార్కెట్ వ్యాపారంలో లక్ష లాభంవస్తే, వోయి నేదాది తెప్పతిరుణాల చేయించాడు. ఈ మారు రెండు 'లకారాలు' పలికింది కాబోలు; రథోత్సవం ఎరగావేశాడు! ముత్తానికి నీ చేతినిండావని - చేతినిండా తడి ..." నవ్వాడు సోమయాజులు.

"సర్లే.. అవతల నాకు పనుంది. ఏమిటి విశేషాలు ?" మొహమాటం తోసివేయలేక నిల్చున్నాడు అచారి చిరాగ్గా!

"విశేషాలు నాకేమున్నాయి? వుంటే నీ కుండాలి. అన్నట్టు గర్భగుడి వెనకాల భజనమందిరంలో (పేక) భజన పెరిగిపోతున్నట్టుందే? మొన్న నెవరో ఓ కొత్త ఆసామీ రాత్రివేళ దైవదర్శనం చేసుకుపోదామని వస్తే, గాలి గోపుర ద్వారం దగ్గర కాపలావున్న సీతిగాడు ఏమన్నాడో తెలుసా? 'స్వామివారికి ఏకాంతసేవ జరుగుతోంది! పూజారులుతప్ప మరెవర్నీ లోపలికి వెళ్ళనివ్వం!' అని ఠంగున చెప్పేశాడు! ఎంచక్కా తర్ఫీదు ఇచ్చావయ్యా స్వామీ! అది సరేగాని బావా....సిన్నను గుడికొచ్చాలే నేను. కొత్తగా వుంది విగ్రహం ముఖం. ఏమిటి చెప్మా అని తికమక పడ్డాను కాస్సేపు .... తర్వాత తెలిసింది ఈ విగ్రహాలన్నిటికీ కళ్ళు కనిపించకుండా కళ్ళమీదుగా నామాలు దిద్దినట్టున్నావు?" కుతూహలంగా అడిగాడు సోమయాజులు.

"అ .... అ! రాముడికీ విష్ణుమూర్తికి, అంజనేయ స్వామికి - అందరికీ కళ్ళ చివరలు మాత్రం వదిలి, కళ్ళ మీదుగా దట్టంగా నామాలు పెట్టాను-వెంకటేశ్వరస్వామిలా

అందంగా, గొప్పగా వుంటుందని!" అన్నాడుఆచారి గర్వంగా నిజానికి కొత్త అలంకరణ అతగాడి మనసు కెందుకో బాగా నచ్చింది

సోమయాజులు పకపక నవ్వాడు.

"భలేభలే ! మీరంతా చేసే వెధవపనులన్నీ దేవుడు చూడకూడదనీ - ఇకముందు చూడటానికి వీలు పడదనీ, దేవుడికళ్ళు మూసేశావన్న మాట నామాలతో !" యాజులు అలాగే పొట్టచెక్కలయ్యేలా నవ్వుతూంటే, ఆచారికి ఒళ్ళు మండిపోయింది

"యాజులూ, ఏమిటా పొగరు మాటలూ ? దేవుడి చూపు నేరుగా ప్రపంచంమీద పడకూడదని అలా కళ్ళు నిండిపోయేలా పెడతారు నామాలు .... ఆచారి మాట పూర్తి కాకముందే అందుకున్నాడు సోమయాజులు.

"నీ విషయంలో మాత్రం నేను చెప్పిందే కరెక్టు. సర్లే ...దేవుడి కళ్ళకు నామాలు దిద్దేంత ఘనుడివయ్యావ్ ! అవతల పనుంది వెళ్ళొస్తా" సోమయాజులు వెళ్ళిపోయాడు. ఉడికిపోయాడు ఆచారి. ఈజడ్డివెధవ.. ఈ సోమయాజులును మొదట్లో శివాలయంలో అర్చకుడిగా నియమించాడు తనే... నయానా, భయానా తన మార్గానికి తెచ్చుకోవాలనిచూశాడు. వూహూం లొంగిరాలేదు. చివరకు విసిగిపోయి "నీకూ ముగ్గురు మగ వెధవ లున్నారు యాజులూ ! ముందుచూపు చూడు. కాస్త వెనక వేసుకుంటే, కుర్రవెధవల చదువులకు అక్కరకు వస్తుంది" అని బోధించాడు కూడా !

యాజులు నిర్లక్ష్యంగా నవ్వి "బావా! నా బిడ్డల భవిష్యత్తు వాళ్ళ నుదిటిమీదే వ్రాసివుంటాడు దేవుడు. కొత్తగా నేను తిరగరాసేదేమిటి? అందుకు దేవుణ్ణి దోచే దేమిటి? నాకీ వుద్యోగం వద్దు - ఎప్పుడో ఓ నాడు గుడికి వచ్చివెళ్తుంటే భగవంతుడిమీద మనసు నిలిచేది. ఇక్కడ కొలువు కుదిరాక నీబోధలూ, నీ అనుచరుల "పూజలు" వినటం దుర్భరంగావుంది నామానాన నన్నుపోనీ" అంటూ బయటికి వెళ్ళిపోయాడు. వాడి ఖర్మ! ఈనాడు వాడి ముగ్గురు కొడుకులూ వారాలు చేసుకుంటూ బి. ఏ, బియస్,సి. ఎం ఏ చదువుతున్నారు. మరివాళ్ళముఖాన అది వ్రాసివుంది. ఏం చేస్తాం. ఎవరిరాత వాళ్ళది, కసిగా అనుకున్నాడు ఆచారి, కంసాలి ఇంటికి వెనక్కి తిరిగివస్తూ.

* * *

"కనీసం ఈరోజయినా అన్ని సొమ్ములూ పెట్టుకోండి నువ్వూ, లలితా, రథోత్సవం మన వీథగుండాకూడావస్తుంది. చూద్దూగానీ...." అన్నాడు ఆచారి ఆఖరు ప్రయత్నంగా.

అన్నపూర్ణ కళ్ళు అగ్నిగోళాల్లా కణకణలాడాయి క్షణకాలం. "ఎందుకూ? తేరుమీద వూరేగే దేవుడికి, తెర వెనుక భాగోతం తెలీదనీ, నీ సొమ్ము ఇదుగో మాదగ్గరుంది! అని గొప్పగా తెలుపు కోవాలనీనా మీవుద్దేశ్యం?" అంది విసురుగా. మరీ ఈ పదిరోజుల్లోనే ఆమెలో ప్రేతకళ బయట పడినట్లని పించింది ఆచారికి.

"నీ ఖర్మ! నీకెలాగూ అనుభవించే రాత లేదు. నువ్వొద్దన్నా పిల్ల దానికి పెడతాను సొమ్ము" పట్టుదలగా అరిచి, ఏడుస్తున్న లలితను బుజ్జగించి మరీ అలంకరించాడు నగలన్నీ. మెరిసిపోతున్న రాళ్ళనగలతో, వెలిగిపోతోంది లలిత 'బాలా త్రిపురసుందరి'లా.

"ఒద్దు... ఒద్దు ఆ సొమ్ము తీసేయండి. మన బిడ్డ క్షేమంకోరి చెబుతున్నాను...." అరుస్తున్న అన్నపూర్ణ మాటలు వినిపించుకోకుండా, లలితను పిల్చుక వెళ్ళిపోయాడు ఆచారి.

తేరుమీద ఉత్సవ విగ్రహాలు జాగ్రత్తగా అమర్చబడ్డాయి. పూజారులు కూర్చోవటానికి దేవుడిక్కాస్త క్రిందుగా రథంలో చుట్టూరా 'మంచె' ఏర్పాటు చేయబడింది. రథమూ, ఇనుప చక్రాలూ రంగురంగుల పూల మాలికలతో రంగురంగుల ముగ్గులతో అలంకరింపబడి వున్నాయి పెద్దపెద్ద మోకులు పట్టుకుని రథాన్ని లాగటానికి సిద్ధంగా వున్నారు కొందరు కండలుతిరిగిన వ్యక్తులు.

ఈలోగా ఓ వేపు 'క్యూ' లో వస్తున్న జనాన్ని అదుపులో పెడుతూనే, మరో వేపు నాలుగుడబ్బులు చేతిలోపెట్టిన వారిని 'క్యూ' లో ముందుకు పోయి వుండేలా నేర్పుగా నెట్టేస్తున్నారు సీతన్న, రాములు వగైరా బంట్రోతులు.

'నాన్నా! నేను రథంలో నీప్రక్కన కూర్చుంటాను" అంది లలిత తండ్రివేపు చూస్తూ.

"కూర్చోమ్మా." అని పైకి అని - నాకు అడ్డుచెప్పే దెవరు ?" అనుకున్నాడు ఆచారి

రథం కదిలింది జనంలో భగవన్నామస్మరణ అధిక మైం దొక్కసారిగా ! తన ప్రక్కనే కూర్చొబెట్టుకున్నాడు లలితను జాగ్రత్తగా. కొబ్బరికాయలు, హారతులు సాగిలబడి మ్రొక్కటాలూ, జనం త్రొక్కిసలాడి పోతున్నారు ! ఆచారికీ, సుబ్రహ్మణ్యానికీ, అయ్యంగారికీ శఠగోపానికి క్షణం వెసులు బాటు చిక్కటంలేదు కొబ్బరికాయలు అందుకోవటం, కొట్టడం, హారతి వెలిగించటం, ప్రసాదం తిరిగి ఇవ్వటం ...

ఇంత చేస్తున్నా ఆచారి మెదడులో ఓమూల ఆలో చన సాగిపోతూనే వుంది ఈ ఉత్సవం పూర్తయితే, ఇక రామిశెట్టి చెయిచిక్కడు. అంచేత రథోత్సవం పూర్తికాగానే, ఎంత పొద్దుపోయినాసరే, రామిశెట్టిని ఒంటరిగా కలుసుకుని ఎవ్వరికీ తెలియకుండా తనకు ఒప్పుకున్న అయిదువందలూ వసూలు చేసుకోవాలి. ఇందులో ఆఫీసరుకు వాటా వుండ కూడదు.

తేరు తన వీధిలోకి మళ్ళింది. అన్నపూర్ణ ఇప్ప డయినా బయటికి వచ్చిచూస్తుందోచూడదో? ఆలోచిస్తున్న ఆచారి భుజంమీద మెల్లిగా తట్టాడు సుబ్రహ్మణ్యం.

'గురువుగారూ ! ఈ కాస్తదూరం మీ ముగ్గురూ అందుకోండి హారతి పళ్ళాలు నేను తేరుదిగివెళ్ళి, దేవుడి అలంకరణ సరిజూస్తాను ఆలయంలో "

ఆచారి తలపూగించాడు. "ఆ .... వెళ్లు .... ఇదుగో చూడు నామం గడ్డ' బాగా అరగదీసి, తెల్లగా, మందంగా, పెట్టు నామాలు. కంటిచివరలు మాత్రం కనిపించాలి విగ్రహానికి...." చెబుతున్న ఆచారి మాటలు గొంతుకలో వుండగానే.... ....ఏదో కుదుపు........జనంలో హాహాకారాలు .... అనుకోని సంఘటన. చిన్నగతుకులో రథచక్రం ఒరిగింది, చక్రం ఒరగటంతో తేరు ఒరిగిందికొద్దిగా.

"జాగ్రత్త జాగ్రత్త...." జనమూ, రథం లాగేవారూ గోలగోలగా అరుస్తున్న కేకలు .... కనుమూసి తెరచేంతలో ఒరిగిన రథంలోనుంచి ప్రక్కకు జారి, క్రిందపడిన లలితను గానీ, ఆ పిల్లను పట్టుకోబోయి తనూ దొర్లిన ఆచారిని గురించి గానీ ఎవరూ గమనించలేదు. గమనించేసరికి, రథచక్రాలు లలిత మీదగా, ఆచారి కాళ్ళమీదుగా దొర్లి పోయాయి. కబురుతెలిసిన అన్నపూర్ణ మరి కళ్ళుతెరవలేదు. కానీ అక్కడ తేరు ఒరిగిన సంగతి తెలియని సుబ్రహ్మణ్యం....తను పనిలోపనిగా తస్కరించిన పదిరూపాయలూ ఆనందంగా రొండిలో దోపుకుని, దేవుడి విగ్రహానికి కళ్ళచివరలు మాత్రం వదిలి, మిగతా కళ్ళు మూసుకుపోయేలా చక్కగా. మందంగా, అందంగా, నామం గడ్డతో నామాలు దిద్దుతున్నాడు.

దేవుడి కళ్ళకు నామాలు దిద్దే ఆచారికేకాదు, దేశమాత కళ్ళకూ, సాటి ప్రజల కళ్ళకూ, నామాలు దిద్దుతున్న దిద్దనున్న ఎవరి ‘శేరు’ అయినా ఏనాడో ఓనాడు ‘ఒరిగి’ తీరుతుంది.

(“యువ” మాసపత్రిక)